


sahanamvande.com
epaper.sahanamvande.com

# సహనం వందే

హైదరాబాద్ | 05-09-2026 శనివారం | సంపుటి-02 సంచిక : 146 EDITOR: ROHINI




# వర్గం ముసుగులో కులం కనుమరుగు

## జనాభా లెక్కల్లో బీసీ కులాల లెక్కింపు లేదు

- కులాలు కాదు వర్గాలే లెక్కిస్తామన్న కేంద్రం
- బీసీ-ఏ, బీ, సీ, డీ లాంటి గ్రూపులతో లెక్క
- ఎస్సీ, ఎస్టీల మాదిరి కులాల కోడింగ్ చేయరు
- బీసీ కులాల జనాభా బయటికి రాకుండా కుట్ర




**మన దేశంలో ఎస్సీ, ఎస్టీల లెక్కలు తీసేటప్పుడు ఏ కులానికి ఆ కులం పేరు పక్కాగా రాస్తారు. కానీ ఓబీసీల విషయానికి వచ్చేసరికి మాత్రం, 'అవి కులాలు కావు, వర్గాలు' అంటూ కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త కొర్రీ పెడుతోంది. అసలు ఇక్కడ వర్గం అంటే ఏంటి? మనం రాష్ట్రాల్లో చూసే బీసీ-ఏ, బీసీ-బీ, బీసీ-సీ, బీసీ-డీ లాంటి గ్రూపులేనా? లేక ఈ వర్గం అనే పదం వెనక ఓబీసీల జనాభాను దాచేసే పెద్ద కుట్ర ఏదైనా ఉందా?**

**- సహనం వందే, హైదరాబాద్**

రాబోయే 2027 జనగణనలో కులాల లెక్కింపుపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం చూస్తుంటేనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీల జనాభాను లెక్కించేటప్పుడు అధికారులు ఒక స్పష్టమైన పద్ధతిని ఫాలో అవుతారు. ఎస్సీ లేదా ఎస్టీ జాబితాలో ఏ కులం పేరు ఉందో, ఆ కులానికి నిర్దిష్టమైన కుల పేరును ప్రత్యేక కోడ్ నంబర్లతో సహా నమోదు చేస్తారు. ఉదాహరణకు... మాల, మాదిగ లేదా గిరిజన ఉప కులాలు ఏవైనా సరే, సర్టిఫికెట్లలో ఎలా ఉంటాయో జనాభా లెక్కల్లో కూడా అలాగే పక్కాగా రికార్డు అవుతాయి. కానీ ఓబీసీల విషయానికి వచ్చేసరికి మాత్రం కేంద్రం ఒక విచిత్రమైన, ఎవరికీ అంతుచిక్కని వాదనను ముందుకు తెస్తోంది.

### వర్గం అంటే ఏంటి?

ఇంతకీ కేంద్రం చెబుతున్న వర్గం లేదా క్లాస్ అంటే ఏమిటి? మన రాష్ట్రాల్లో బీసీలను లేదా వెనుకబడిన తరగతులను ఏ విధంగా అయితే బీసీ-ఏ, బీసీ-బీ, బీసీ-సీ, బీసీ-డీ లాంటి గ్రూపులుగా విభజిస్తారో, కేంద్రం ఈ వర్గాలనే ఉద్దేశిస్తోంది. అంటే ఒకే కేటగిరీ కింద పదుల సంఖ్యలో వేర్వేరు కులాలను కలిపి ఒక గ్రూప్‌గా తయారు చేస్తారు. ఉదాహరణకు, బీసీ-ఏ కింద కొన్ని డజన్ల చిన్న కులాలు ఉంటాయి, బీసీ-బీ కింద వేరే కులాలు ఉంటాయి. ఈ ఏ, బీ, సీ, డీ లాంటి పెద్ద గ్రూపులను మాత్రమే చూస్తాం తప్ప, ఆయా గ్రూపుల్లో ఉన్న విడివిడి కులాల పేర్లను లెక్కించలేం అని కేంద్రం వాదిస్తోంది.

### బీసీ జనాభా బయటికి రాకుండా కుట్ర...

ఎస్సీ, ఎస్టీలకు ఒక పద్ధతి, బీసీలకు మరొక పద్ధతి పెట్టడం వెనక కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి? ఒకవేళ ప్రస్తుతం అందుబాటులో ఉన్న బీసీ జాబితాలలో కులాల పేర్ల విషయంలో ఏవైనా సాంకేతిక లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా? ఎస్సీ, ఎస్టీ జాబితాలను ఎలాగైతే ఎప్పటికప్పుడు సవరించి సరిగ్గా అమలు చేస్తున్నారో అలాగే బీసీ జాబితాలను కూడా నిపుణుల కమిటీల చేత సరిచేయవచ్చు. కానీ ఆ జాబితాలను మొత్తంగా పక్కన పడేసి, ఓపెన్ కాలమ్ పద్ధతిని తెచ్చి ఎవరికి వారు ఇష్టమొచ్చిన పేర్లు రాసుకునేలా వదిలేయడం అంటే అసలు బీసీల కచ్చితమైన జనాభా బయటికి రాకుండా కుట్ర చేయడమే అవుతుంది.

### సర్టిఫికెట్లలో రాస్తున్నప్పుడు సమస్యేంటి?

సాధారణ సమయాల్లో ప్రభుత్వ రికార్డులు, కుల ధృవీకరణ పత్రాలు ప్రతీ ఒక్కరినీ వారి నిర్దిష్టమైన కులం గుర్తింపుతోనే స్పష్టంగా ఉంటాయి. బీసీ కేటగిరీకి చెందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేటప్పుడు వారి నిర్దిష్టమైన కులం పేరును, అలాగే అది ఏ గ్రూప్ కింద వస్తుందో స్పష్టంగా రాస్తారు. అలాగే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇచ్చేటప్పుడు కూడా నిర్దేశిత కులం ప్రాతిపదికన గుర్తిస్తున్నారు. మరి అలాంటప్పుడు జనాభా లెక్కల్లో మాత్రం ఈ రెండు వేరని చెప్పడం పచ్చి మోసం కాక మరేంటి? బీసీ సంఘాలు లేవనెత్తుతున్న ఈ న్యాయమైన డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుంటుందా లేక పాత సాకులతోనే కాలం గడుపుతుందా అనేది చూడాలి. ఏది ఏమైనప్పటికీ దేశంలో కులగణన అంశంపై జరుగుతున్న ఈ వర్గాల గోల్‌మాల్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోంది.



# సమాధిలో గర్జిస్తున్న హిట్లర్

## మళ్లీ పెనుభూతమై వస్తున్న నాజీయిజం

- జర్మనీలో జరుగుతున్న ఎన్నికలపై ఉత్కంఠ
- హిట్లర్ సిద్ధాంతం నమ్మిన పార్టీకి బ్రహ్మరథం
- యూరప్ అంతటా నాజీ భావజాలం విస్తరణ

**ప్రపంచాన్ని ఏలిన హిట్లర్ కాలం నాటి చీకటి రోజులు మళ్లీ జర్మనీని భయపెడుతున్నాయా? హిట్లర్ నిష్క్రమించి దశాబ్దాలు గడుస్తున్నా, సరిగ్గా అదే దేశంలో ఇప్పుడు మళ్లీ కొత్త రూపంలో మితవాదం పంజా విసురుతోంది! అసలు జర్మనీ రాజకీయాల్లో ఏం జరుగుతోంది? అక్కడి ప్రజలు ఎందుకు మళ్లీ తీవ్రవాద పార్టీ వైపు అడుగులు వేస్తున్నారు?**

**- సహనం వందే, జర్మనీ**




జర్మనీ దేశంలోని సాక్సనీ-అన్హాల్ట్ రాష్ట్రంలో రాజకీయ ప్రకంపనలు చెలరేగుతున్నాయి. ఈ నెల 6న జరగబోయే ఈ రాష్ట్ర ఎన్నికల్లో ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ) పార్టీ ఊహించని విజయాన్ని సాధించే దిశగా దూసుకెళ్తోంది. దశాబ్దాలుగా అక్కడి రాజకీయాల్లో ప్రధాన స్రవంతి పార్టీలే అధికారాన్ని చెలాయిస్తూ వస్తున్నాయి. కానీ ప్రస్తుత ఎన్నికల సర్వేల ప్రకారం, ఈ తీవ్రవాద పార్టీ ఏకంగా 40 శాతానికి పైగా ఓట్లను సాధించి అతిపెద్ద రాజకీయ శక్తిగా అవతరించేందుకు సిద్ధమవుతోంది.

### ప్రపంచ దేశాలను కలవరపెడుతోన్న సమస్య...

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీలో నాజీ పాలన అంతమైంది. అప్పటి నుంచి ఆ దేశం ఎప్పుడూ కూడా ప్రజాస్వామ్య విలువలకు, ఉదారవాద రాజకీయాలకు కట్టుబడి ఉంటూ వచ్చింది. కానీ ఇప్పుడు అదే జర్మనీలో ఒక తీవ్రవాద మితవాద పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయికి చేరుకోవడం ప్రపంచ దేశాలను తీవ్రంగా కలవరపెడుతోంది. ముఖ్యంగా ఆ పార్టీ అనుసరిస్తున్న విధానాలు, ప్రసంగాలు పాత నాజీల రోజులను గుర్తుకు తెస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### విదేశీయులను తరిమేస్తామంటూ...

ఈ పార్టీ ఇంత వేగంగా బలపడడానికి ప్రధాన కారణం అక్కడి ప్రజల్లో ఉన్న ఆర్థిక అసంతృప్తి, నిరుద్యోగమే. జర్మనీలోని పశ్చిమ ప్రాంతంతో పోలిస్తే తూర్పు ప్రాంతంలోని ప్రజలు చాలా కాలంగా ఉపాధి లేక ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. దీంతో అక్కడి యువత తీవ్ర నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయింది. ప్రజల్లో ఉన్న ఈ అసంతృప్తిని ఏఎఫ్‌డీ పార్టీ తమ రాజకీయ లబ్ధి కోసం తెలివిగా వాడుకుంటోంది. దేశంలో నిపుణుల కొరత తీవ్రంగా ఉంటే, ఈ పార్టీ మాత్రం విదేశీయులను పెద్ద ఎత్తున తరిమేస్తామంటూ నినాదాలు చేస్తోంది. సోషల్ మీడియా ద్వారా వస్తున్న తప్పుడు ప్రచారాలు కూడా ఈ పార్టీకి మరింత బలానిస్తున్నాయి.

### యూరప్ అంతటా ఇదే భావజాలం...

యూరప్ అంతటా ఇప్పుడు మితవాద భావజాలం వేగంగా విస్తరిస్తోంది. ఫ్రాన్స్ నుంచి బ్రిటన్ వరకు తీవ్రవాద పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థలకే సవాళ్లు విసురుతున్నాయి. ఇలాంటి ప్రమాదకరమైన తరుణంలో జర్మనీ ప్రజలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు యావత్ ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తుంది. విద్వేషపూరిత రాజకీయాలకు లొంగిపోవాలా లేక వాటిని ధైర్యంగా ఎదుర్కొని మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవాలా అనే అతిపెద్ద పరీక్ష జర్మనీ ఎదుట నిలిచింది.

# అమెరికా గడ్డపై మన బిడ్డల గోడు

## భారతీయులపై పెరుగుతున్న జాతి వివక్ష

**అమెరికా అంటేనే అప్పట్లో అందరికీ బంగారు భవిష్యత్తు కనిపించేది. అక్కడికి వెళ్తే డాలర్లు సంపాదించవచ్చు, లైఫ్ సెటిల్ అయిపోతుంది అనుకునేవాళ్లం. కానీ ఇప్పుడు అదే అమెరికాలో అడుగుపెట్టడమే కష్టంగా మారుతోందట. అసలు అక్కడ ఏం జరుగుతోంది? అక్కడికి వెళ్లిన భారతీయులపై ఎందుకు ఇంత కక్ష గడుతున్నారు? ఉషా వాన్స్ నుంచి వివేక్ రామస్వామి దాకా పెద్ద పెద్ద వాళ్లే ఎందుకు టార్గెట్ అవుతున్నారు?**

**- సహనం వందే, అమెరికా**

- ఉషా వాన్స్, వివేక్ రామస్వామిలపై దాడులు
- ఇండియన్లపై రెండింతలు పెరిగిన దాడులు
- స్టాప్ ఏపీఐ హేట్ రిపోర్టులో వెల్లడైన నిజాలు



స్టాప్ ఏపీఐ హేట్ సంస్థ తాజాగా విడుదల చేసిన ఒక షాకింగ్ రిపోర్ట్ ప్రకారం, సౌత్ ఏషియన్లను కించపరిచే మాటలు, జాతి దూషణలు గత రెండేళ్లలో ఏకంగా 109 శాతం పెరిగాయట. అంటే పరిస్థితి ఎంత వేగంగా దిగజారిపోతుందో అర్థం చేసుకోవచ్చు. కేవలం మాటలతో సరిపెట్టకుండా భౌతికమైన దాడులకు కూడా తెగిస్తున్నారు. మన వాళ్ళు ఎదుర్కొంటున్న ఈ సమస్య రోజురోజుకూ ఒక ప్రమాదకరమైన స్థాయికి చేరుకుంటోంది. ఆఫీసుల్లో, కాలేజీలలో, రోడ్లపై ఎక్కడ చూసినా ఈ రకమైన మానసిక వేధింపులు పెరిగిపోయాయి. దీన్ని చూస్తుంటే అమెరికాలో బతకడం ఇప్పుడు ఎంత కష్టంగా మారిందో స్పష్టంగా అర్థమవుతోంది.

### ఎంత పెద్ద పదవుల్లో ఉన్నా...

ఈ దాడులు కేవలం సాధారణ ప్రజలకే పరిమితం కాలేదు. అమెరికా రాజకీయాలలో ప్రముఖంగా వెలుగొందుతున్న పెద్ద పెద్ద నాయకులు కూడా ఈ జాతి వివక్ష బారిన పడుతున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వ్యాన్స్ భార్య, భారత సంతతికి చెందిన ఉషా వాన్స్, అలాగే ఒకప్పుడు అధ్యక్ష రేసులో నిలిచిన వివేక్ రామస్వామి లాంటి ప్రముఖులు కూడా ఈ దాడుల బారిన పడుతున్నారు. మరోవైపు న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మామ్దాని కూడా ఇలాంటి దాడులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎంత పెద్ద పదవుల్లో ఉన్నా, ఎంత శక్తివంతమైన వాళ్లయినా ఈ వివక్ష నుంచి తప్పించుకోలేకపోతున్నారు.

### ఎదుగుదలను ఓర్వలేని పరిస్థితి...

మన ఇండియన్ అమెరికన్లు రాజకీయంగా, ఆర్థికంగా రోజురోజుకూ చాలా వేగంగా ఎదుగుతున్నారు. కంపెనీలకు సీఈఓలుగా మారుతున్నారు, పెద్ద పెద్ద రాజకీయ పదవులను అధిరోహిస్తున్నారు, చివరికి అమెరికా అధ్యక్ష ఎన్నికలలో కూడా తమ సత్తా చాటుతున్నారు. ఈ రాజకీయ, సామాజిక గుర్తింపు స్థానిక శ్వేతజాతీయులలో ఒక రకమైన అసూయను, భయాన్ని పుట్టిస్తోంది. మన వాళ్ళు తమ స్థానాలను లాగేసుకుంటారనే అభద్రతాభావమే ఈ రకమైన దాడులకు దారితీస్తోందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. కేవలం రంగు, జాతి పేరుతో ఇలాంటి దాడులు జరగడం మాత్రం నిజంగా మానవ హక్కులకే ఒక పెద్ద మచ్చగా మిగిలిపోతుంది. పక్క దేశాల నుంచి వచ్చి అక్కడ ఎదుగుతున్న వాళ్ళని చూసి ఓర్వలేకపోవడం మానవ నైజంలోని చీకటి కోణాన్ని బయటపెడుతోంది.